## క్లుప్తంగా

### 30లోగా రైతు బజార్ స్టాళ్లకు దరఖాస్తు చేసుకోవాలి

కంచికచర్ల: కంచికచర్ల రైతు బజార్‌లో ఖాళీగా ఉన్న స్టాళ్లకు ఈనెల 30వ తేదీలోగా డ్వాక్రా సభ్యులు దరఖాస్తు చేసుకోవాలని రైతు బజార్ ఇన్‌చార్జి నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 12 స్టాళ్లు ఖాళీగా ఉన్నాయని, అయితే స్వయం సహాయక సభ్యులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి సమాచారం కోసం సెల్ నంబర్ 97050 02223కు ఫోన్ చేయాలన్నారు.

### బాల్య వివాహాలతో భవిష్యత్తు ఛిద్రం

వీరులపాడు: బాల్య వివాహాల వల్ల బాలికల బంగారు భవిష్యత్తు ఛిద్రమవుతుందని వైద్యాధికారి నందిని, సర్పంచ్ కన్నమాల సురేష్ బాబు అన్నారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా వీరులపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై మంగళవారం అవగాహన కలిగించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వట్టికొండ చంద్రమోహన్, ఎంపీటీసీ సభ్యుడు మండూరి ప్రకాశరావు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### పోచంపల్లిలో గ్రామ సభ

పోచంపల్లి(జగ్గయ్యపేట): ఉపాధి హామీ పథకం పనుల్లో ఎలాంటి సమస్యలున్నా గ్రామ సభలో తెలపాలని ఏపీఎం సంతోష్ తెలిపారు. గ్రామంలోని సచివాలయంలో మంగళవారం సోషల్ ఆడిట్ గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో 2020–22 వరకు గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులను నిర్వహించారన్నారు. ఈ పనులలో సమస్యలున్నా, వేతనాల మంజూరులో జాప్యం ఉన్నా తెలియజేయాలన్నారు. అనంతరం రెండేళ్ల పని వివరాలను గ్రామ సభలో వివరించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ రవీందర్, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ బూతుకూరి నాగిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

### స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై రిలే నిరాహార దీక్ష

నందిగామ: విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీ సెంటర్ లో మంగళవారం రిలే నిరాహార దీక్ష కార్యక్రమం నిర్వహించారు. సీపీఐ నాయకుడు చుండూరు సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ దీక్షా కార్యక్రమానికి ఆ పార్టీ నాయకులు సీహెచ్ కోటేశ్వరరావు, శంకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. దీక్షకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కన్నెగంటి జీవరత్నంతోపాటు పలువురు న్యాయవాదులు సంఘీభావం తెలిపారు.

### సబ్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ



నందిగామ: వేసవికాలంలో కూడా వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా చర్యలు చేపడుతున్నట్లు ఉమ్మడి కృష్ణాజిల్లా ఎస్ఈ ఎ.మురళీమోహన్ తెలిపారు. పట్టణంలోని సబ్ స్టేషన్‌ను మంగళవారం రాత్రి ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న విద్యుత్ వినియోగదారుల సంఖ్య, ప్రస్తుతం విద్యుత్ సరఫరాకు సంబంధించిన అంశాలు, రాబోయే వేసవిలో నాణ్యమైన విద్యుత్ అందించేందుకు తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలు, సిబ్బంది పనితీరు తదితర అంశాలపై స్థానిక అధికారులతో చర్చించారు. రూరల్ ఈఈ శ్రీనివాసరావు, స్థానిక డీఈ రమేష్‌బాబు, ఏఈ దిబ్బయ్య పాల్గొన్నారు.

### బాల్ బ్యాడ్మింటన్‌లో సత్తా చాటిన కేవీఆర్ విద్యార్థిని



నందిగామ: బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో స్థానిక కాకాని వేంకటరత్నం కళాశాల క్రీడాకారిణి సత్తా చాటింది. ఇటీవల కైకలూరులోని వైవీఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కృష్ణా విశ్వ విద్యాలయం మహిళల బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో కేవీఆర్ కళాశాల విద్యార్థిని పి.కావ్య అత్యుత్తమ ప్రతిభ కనబరచడం ద్వారా తమిళనాడులో ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు జరిగే పోటీలకు విశ్వ విద్యాలయం జట్టు తరఫున ఎంపికైంది. ఈ సందర్భంగా కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు వై.బాబూరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాయప్ప, గేమ్స్ కమిటీ ప్రతినిధులు, ఫిజికల్ డైరెక్టర్ వాసిరెడ్డి నాగేశ్వరరావు తదితరులు విద్యార్థిని కావ్యను ప్రత్యేకంగా అభినందించారు.

### వాహన చోదకులు నిబంధనలు పాటించకపోతే చర్యలు

నందిగామ: వాహన చోదకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఎస్‌హెచ్‌ఓ సతీష్ అన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం రాత్రి ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. లైసెన్స్ లేకుండా వాహనాలకు నంబర్ ప్లేట్లు లేకుండా, అతి వేగంగా వెళుతున్న, ట్రిపుల్ రైడ్ చేస్తున్న, మైనర్లు నడుపుతున్న పలు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా లైసెన్స్‌తో పాటు వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలను దగ్గర ఉంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీలలో ఎస్ఐ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

# రీ సర్వేతో భూ సమస్యలకు చెక్

**బ్రిటీష్ కాలంలో రూపొందించిన రెవెన్యూ రికార్డులు నేటికీ కొనసాగుతుండటంతో నిత్యం భూ యజమానుల మధ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఆ భూముల పరిష్కారం కోసం రైతులు, ప్రజలు ఏళ్ల తరబడి కోర్టులు, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో భూ సమస్యలకు చెక్ పెట్టేందుకు భూముల సమగ్ర సర్వేకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నందిగామ నియోజకవర్గంలో కంచికచర్ల మండలం పరిటాల గ్రామంలో ఇప్పటికే సర్వే పూర్తిస్థాయిలో నిర్వహించి పట్టాదారు పాసుపుస్తకాలు అందజేశారు. ప్రస్తుతం అదే మండలంలో మరో మూడు గ్రామాల్లో సర్వే జరుగుతోంది.**



నందిగామ నియోజకవర్గంలో భూముల రీ సర్వేకు సంబంధించిన డ్రోన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు(ఫైల్)

కంచికచర్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా భూముల రీ సర్వే ద్వారా భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభించనుంది. ఇటీవల కంచికచర్ల మండలం పరిటాల గ్రామంలో భూముల రీ సర్వే చేపట్టామని ప్రభుత్వ, ప్రయివేటు వ్యక్తులకు సంబంధించిన 6, 250 ఎకరాల్లో సర్వే చేపట్టి పూర్తిచేశామని తహసీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి తెలిపారు. రైతులందరికీ పాసుపుస్తకాలు కూడా పంపిణీ చేశామన్నారు. ప్రస్తుతం మండలంలోని పేరకలపాడులో 140 ఎకరాలు, పెండ్యాలలో 263 ఎకరాలు, ఎస్.అమరవరం గ్రామంలో 171 ఎకరాల్లో సర్వే చేపడుతున్నామని ఇప్పటికే డ్రోన్ ద్వారా మ్యాపింగ్ చేశామని చెప్పారు. దాదాపు వందేళ్ల తర్వాత దేశంలోనే తొలిసారిగా ఆంధ్రరాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం భూముల సమగ్ర సర్వేకు చర్యలు చేపట్టింది. పైలెట్ ప్రాజెక్టు ద్వారా ఇప్పటికే జిల్లాలోని పలు గ్రామాలతో పాటు కంచికచర్ల మండలంలోని పరిటాల గ్రామంలో సర్వే పూర్తయింది. మండలంలోని కీసర, పెండ్యాల, బత్తినపాడు, సైదాపురం, వేములపల్లి, నందిగామ మండలంలోని పల్లగిరి, జగ్గయ్యపేట నియోజకవర్గంలో కూడా అధికారులు భూముల రీ సర్వే పనులు చేపట్టారు. పంచాయతీ అధికారుల సహాయంతో నివాస గృహాలను గుర్తించటంతో పాటు అన్ని రకాల భూములను గుర్తించేందుకు ప్రతి హద్దుకు జీఎన్ఎస్ఎస్ రోవర్, ఈటీఎస్ వంటి ఆధునిక యంత్రాల సహాయంతో అక్షాంశ, రేఖాంశాలతో కూడిన జియో కోడ్స్ డేటాను, భూముల ఛాయా చిత్రాలను సేకరిస్తారు. ఈ డేటా ఆధారంగా సర్వే ఆఫ్ ఇండియా ప్రతి గ్రామానికి ఆర్థోరెక్టిఫైడ్ ఇమేజ్(ఓఆర్ఐ) ఛాయా చిత్రాలను అందించి కచ్చితమైన భూ కొలతలను నిర్ధారిస్తుంది. రైతులు కోరితే గొలుసులతో కూడా భూమిని కొలిచి విస్తీర్ణాన్ని చూపిస్తారు. అప్పటికీ భూములను రీ సర్వే చేసిన తదుపరి ఏమైనా అభ్యంతాలుంటే మొబైల్ కోర్టు, మండల మేజిస్ట్రేట్(తహసీల్దార్)కు అప్పీలు చేసుకుంటే 30 రోజుల్లోగా పరిష్కరిస్తారు.

> **భూ సమస్యలు తగ్గుతాయి**
>
> జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం ద్వారా భూ సమస్యలు తగ్గుతాయి. వందేళ్ల నాటి భూములను రీ సర్వే చేయటం ద్వారా సరిహద్దులు పక్కాగా తేలతాయి. ఎవరి పొలం ఎంత విస్తీర్ణం ఉందో తేలుతుంది. దీంతో రైతులు, ప్రజలు భూ సమస్యల పరిష్కారం కోసం పోలీస్‌స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరిగే అవస్థలు ఉండవు. పరిటాల గ్రామంలో 6,250 ఎకరాల్లో భూ సర్వే పూర్తి చేశాం. పట్టాలు కూడా రైతులకు అందజేశాం.
>
> – వడ్డేశ్వరపు రాజకుమారి, తహసీల్దార్, కంచికచర్ల

## రుణాలు పొందిన మహిళలు వ్యాపారాలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు

పెనుగంచిప్రోలు: ప్రభుత్వ పథకాల ద్వారా రుణాలు తీసుకున్న డ్వాక్రా మహిళలు అందరూ తప్పక ఏదో ఒక వ్యాపారాన్ని నిర్వహించాలని డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో మంగళవారం గ్రామైఖ్య సంఘాలు, వెలుగు కార్యాలయ సీసీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల మహిళలు తీసుకున్న రుణంతో వ్యాపారాలు చేయించాల్సిన బాధ్యత గ్రామైఖ్య సంఘాలకు ఉందన్నారు. ప్రతి ఒక్కరూ వ్యాపారాలు నిర్వహించుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. మహిళలను వ్యాపారాల వైపు మళ్లించలేని వీఓలు తప్పుకోవచ్చన్నారు. పెనుగంచిప్రోలులో ఫిబ్రవరిలో మహిళా మార్టు ఏర్పాటు చేయాలని, దీనికి సంబంధించి అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏపీ సహాయరాజు, మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ, ఏపీఎం రాజారావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినులు భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలి



మానవహారంలో విద్యార్థినులతో ఐసీడీఎస్ కార్యకర్తలు, ఉపాధ్యాయినులు

పెనుగంచిప్రోలు: విద్యార్థినులు చెడు మార్గాల వైపు మరలకుండా భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి అన్నారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రం పెనుగంచిప్రోలులో కిశోర బాలికలతో ప్రతిజ్ఞ చేయటంతో పాటు ర్యాలీ, అనంతరం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. చైల్డ్ హెల్ప్‌లైన్, ఇతర రక్షణ చట్టాలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. కొణకంచి జెడ్పీ హైస్కూల్‌లో ప్రతిజ్ఞ, మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జ్యోతి, వైద్యాధికారి వాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## భక్తులకు అసౌకర్యం కలిగించొద్దు

**ఆలయ ఈఓ లీలాకుమార్**

పెనుగంచిప్రోలు: గ్రామంలో ఉన్న శ్రీగోపయ్య సమేత శ్రీతిరుపతమ్మ అమ్మవారి కల్యాణ మహోత్సవానికి సంబంధించి ఏర్పాట్ల విషయంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలిగించవద్దని ఆలయ ఈఓ జీవీడీఎన్ లీలాకుమార్ తెలిపారు. ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, ఏఈ రాజుతో కలిసి మంగళవారం ఆయన కల్యాణం జరిపించే స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కల్యాణ ఏర్పాట్లకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఫిబ్రవరి 5 న జరిగే శ్రీగోపయ్య సమేత తిరుపతమ్మవారి కల్యాణం సందర్భంగా పీటలపై కూర్చొనే దంపతులు కమ్మ కులస్తులై ఉండి శ్రీగోపయ్య స్వామి తరఫున కోళ్లూరు గోత్రంతో కాకాని ఇంటి పేరు గలవారు, శ్రీతిరుపతమ్మ అమ్మవారి తరఫున పగిడిపాళ్ల గోత్రంతో కొల్లా ఇంటి పేరు గలవారు మాత్రమే జనవరి 27 సాయంత్రం 4 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను జనవరి 27వ తేదీ సాయంత్రం 5 గంటలకు ఈవో కార్యాలయంలో లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తారన్నారు. ఎంపికైన వారు ఫిబ్రవరి 5 న జరిగే కల్యాణ మహోత్సవానికి స్వామివారు, అమ్మవారి అలంకరణకు రూ.5000కు పైబడిన పట్టు వస్త్రములు కొనుగోలు చేసి ఫిబ్రవరి 3 న ఆలయం వారికి అప్పగించాలన్నారు.


## లంక భూములను పరిశీలించిన జేసీ



గనిఆత్కూరు లంక భూములను పరిశీలిస్తున్న జేసీ శ్రీవాస్ నుపూర్, రెవెన్యూ అధికారులు

కంచికచర్ల: మండలంలోని గనిఆత్కూరు గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు లీజుకు ఇచ్చేందుకు వ్యవసాయ సాగుకు అనుకూలమైందా లేదా అని జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్‌కుమార్ లంక భూములను పరిశీలించారు. కొత్తపేట గ్రామానికి చెందిన కొంతమంది రైతులు ప్రభుత్వ భూములను గతంలో సాగుచేసుకున్నారని, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ ఏడాది కూడా వారికే లీజుకు ఇస్తామన్నారు. అయితే ఆ భూములు సాగుకు అనువుగా ఉంటాయా లేదా అని పరిశీలిస్తున్నామని జేసీ తెలిపారు. కార్యక్రమంలో నందిగామ ఆర్డీఓ ఎ.రవీంద్రరావు, తహసీల్దార్ వి.రాజకుమారి, డివిజనల్ సర్వేయర్ రవీంద్ర, ఆర్ఐ శిరీష, మండల సర్వేయర్ బసవరావు, వీఆర్వో సునందారాణి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## బుర్రకథ కళాకారుడు చిన్నప్ప కన్నుమూత



దుగ్గిరాల చిన్నప్ప (ఫైల్)

నందిగామ: ప్రముఖ బుర్రకథ కళాకారుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు దుగ్గిరాల చిన్నప్ప (86) గుండెపోటుతో నందిగామ రైతుపేటలోని తన స్వగృహంలో మంగళవారం తెల్లవారుజామున తుది శ్వాస విడిచారు. చిన్నప్ప ఉపాధ్యాయునిగా పనిచేస్తూనే, బుద్దా బెంజిమెన్ జోసఫ్, దివంగత పిల్లి యాగప్పలతో కలసి ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని అనేక గ్రామాల్లో క్రైస్తవ బుర్రకథలను ప్రదర్శించి హాస్య బ్రహ్మగా కీర్తి గడించారు. చిన్నప్పకు ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. పెద్ద కుమారుడు దుగ్గిరాల లీనో జోసఫ్ కొన్ని సినిమాలకు సంగీత దర్శకునిగా కూడా పనిచేశారు. చిన్నప్ప మృతికి శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ తదితరులు సంతాపం తెలియజేశారు. చిన్నప్ప మరణ వార్త తెలుసుకున్న అనేక మంది కళాకారులు, అభిమానులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు కడసారి ఆయన భౌతిక కాయాన్ని సందర్శించేందుకు తరలివచ్చి నివాళులర్పించారు.

## గొల్లమూడిలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు

నందిగామ: ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని గొల్లమూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యుడు రవి అన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని పల్లగిరి గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించడంతో పాటు గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. గ్రామంలోని 135 మందికి వైద్య సేవలందించటంతో పాటు పలువురికి పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### వాసవీ క్లబ్ అధ్యక్షుడిగా హరిబాబు



క్లబ్ అధ్యక్షుడు హరిబాబును అభినందిస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు

వత్సవాయి: వాసవీ క్లబ్ అధ్యక్షుడిగా మద్దు హరిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా కూర్మాల జనార్దన్, ట్రెజరర్‌గా గార్లపాటి రవికిరణ్‌లను ఎన్నుకున్నారు. మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు బొగ్గవరపు వెంకట రాజారావు అధ్యక్షతన మంగళవారం ఎన్నిక జరిగింది. హరిబాబుతో రీజనల్ చైర్మన్ కొత్త కృష్ణారావు ప్రమాణం చేయించారు. జోనల్ చైర్మన్ రాయపూడి శ్రీకాంత్, మద్దు కోటేశ్వరరావు, గుర్రం హనుమంతురావు, పల్లపోతుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

### రేపు త్రిశక్తి పీఠంలో మాతృదేవోభవ కార్యక్రమం

నందిగామ: వసంత పంచమిని పురస్కరించుకుని నందిగామ పట్టణ శివారుల్లోని సమత శిఖరం (పల్లగిరి కొండ)పై గల త్రిశక్తి పీఠంలో ఈ నెల 26న మాతృదేవోభవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అర్చకుడు రాజేష్ శర్మ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం 8.30 గంటలకు సామూహిక అక్షరాభ్యాసం, సరస్వతి పూజ, పిల్లలతో తల్లిదండ్రులకు పాదపూజ కార్యక్రమం, పబ్లిక్, పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థినీ విద్యార్థుల పేరిట గోత్ర నామ పూజలు నిర్వహించడంతో పాటు అమ్మవారి పేరిట పుస్తకం, పెన్ను అందించనున్నట్టు తెలిపారు.

### మైనర్‌లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులదే బాధ్యత

జగ్గయ్యపేట: మైనర్‌లకు వాహనాలు ఇచ్చిన తరువాత జరిగే పరిణామాలకు వారి తల్లిదండ్రులనే బాధ్యులను చేస్తామని నందిగామ రవాణా శాఖాధికారి పద్మావతి అన్నారు. రహదారి భద్రతా వారోత్సవాల ముగింపులో భాగంగా పట్టణంలోని తొర్రకుంటపాలెంలోని ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయం వద్ద డ్రైవర్‌లకు మంగళవారం అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రహదారి భద్రతా వారోత్సవాలలో భాగంగా వాహనదారులకు రోడ్డు నిబంధనలు వివరించామన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో ఆటో డ్రైవర్‌లు, ద్విచక్ర వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించటంలో అవగాహన లోపిస్తుందన్నారు. రవాణా శాఖాధికారులు ప్రత్యేక శిబిరాలు నిర్వహించి రహదారి భద్రతపై వారికి అవగాహన కలిగించాలన్నారు. అనంతరం ఉత్తమ డ్రైవర్‌లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంవీఐ రవికుమార్, డ్రైవర్‌లు పాల్గొన్నారు.

## బాలికలపై వివక్షను విడనాడాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

నందిగామ(చందర్లపాడు): బాలికలపై వివక్షను చూపకుండా వారిని అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఆడ, మగ అనే భేద భావం లేకుండా అందరినీ సమానంగా చూడాలని, ఆడపిల్లలను చదివించడం, ఉద్యోగాలు చేసేలా ప్రోత్సహించడం ద్వారా దేశం మరింతగా అభివృద్ధి సాధిస్తుందన్నారు. వ్యాసరచనలో కె.అమూల్య, కె.శ్రీజ, పి.రాణి, వక్తృత్వ పోటీల్లో వి.వినీల, వి.కవిత, బి.వేళంగిణి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నిబంధనలు కచ్చితంగా పాటిస్తే ప్రమాదాల నిరోధం

**ఆర్టీఓ పద్మావతి**



వాహనాలకు పోస్టర్లు అతికిస్తున్న ఆర్టీవో పద్మావతి, రవాణా శాఖాధికారులు

నందిగామ: రవాణా శాఖ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను పూర్తి స్థాయిలో నిరోధించవచ్చునని నందిగామ రవాణా శాఖాధికారి పద్మావతి అన్నారు. రహదారి భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం పలువురికి రవాణా శాఖ నిబంధనలపై అవగాహన కల్పించడంతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రచారం కల్పిస్తూ పలు వాహనాలకు వాల్‌పోస్టర్లను అతికించారు. ఈ సందర్భంగా ఆర్టీఓ మాట్లాడుతూ క్షేమంగా గమ్యం చేరుకోవడమే ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలన్నారు. నిర్లక్ష్యపు చోదనం వల్ల అనర్థాలు తప్ప ఎటువంటి ప్రయోజనం ఉండదన్నారు. రవాణా శాఖ నిబంధనలను తూ.చ. తప్పకుండా పాటిస్తే ప్రమాదాలు జరగడానికి ఎటువంటి ఆస్కారం ఉండదన్నారు. మద్యం తాగి, సెల్ ఫోన్ మాట్లాడుతూ, మితిమీరిన వేగంతో వాహనాలు నడపడం మానుకోవాలన్నారు. కార్యక్రమంలో వాహన తనిఖీ అధికారి ఎం.వి.ఎస్.రాజు, పరిపాలన అధికారి బి.ఎస్.కె.ప్రభాకర లింగం పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ నిషేధంపై నిబంధనలు కఠినంగా అమలు

**కమిషనర్ శివకోటేశ్వరరావు**



మున్సిపల్ కమిషనర్ శివకోటేశ్వరరావు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పురపాలక సంఘ పరిధిలో ప్లాస్టిక్ నిషేధంపై ప్రభుత్వం కఠినంగా నిబంధనలను అమలు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శివకోటేశ్వరరావు తెలిపారు. ఆయన మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధంపై ప్రభుత్వం విధించిన నిబంధనలను వివరించారు. ప్లాస్టిక్ బ్యానర్లపై ఈనెల 26 వ తేదీ నుంచి నిషేధం అమలు చేయనున్నట్లు తెలిపారు. 120 మైక్రాన్ల కన్నా తక్కువ ఉన్న ప్లాస్టిక్ కవర్లను గత ఏడాది డిసెంబర్ 31 నుంచే నిషేధించినట్లు తెలిపారు. జనవరి 26 వ తేదీ నుంచి ప్లాస్టిక్ బ్యానర్లు వాడిన వారికి స్క్వేర్ ఫీట్‌కు రూ.100 చొప్పున జరిమానా విధించనున్నట్లు తెలిపారు. ప్రతి సచివాలయంలో సిబ్బంది, వలంటీర్లకు, పొదుపు సంఘాల వారికి కూడా ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్లాస్టిక్ ఫ్లెక్సీ బ్యానర్ల నిషేధంపై పట్టణంలో మైకు ద్వారా అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. నిషేధం అమలుపై ప్రతి సచివాలయంలో ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటుచేశామని, సదరు టాస్క్‌ఫోర్స్ కమిటీ వారు వారి సచివాలయం పరిధిలోని షాపులు, వ్యాపార సంస్థల్లో తనిఖీలు నిర్వహించి ప్లాస్టిక్ కవర్లు ఉన్నట్లైతే జరిమానాలు విధిస్తారని తెలిపారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్, శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ సెక్రటరీ వారు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేస్తారని తెలిపారు. పట్టణంలోని వర్తక, వాణిజ్య సముదాయాల యజమానులు, ఫ్లెక్సీ, బ్యానర్లు ప్రింటు చేసే యజమానులు ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించాలని, లేని పక్షంలో జరిమానాలను విధించడంతో పాటు షాపుల వ్యాపార లైసెన్స్‌లను రద్దు చేయడానికి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## జగన్ పాలనపై భరోసాతోనే చేరికలు

**వైఎస్సార్ సీపీ యువజన నేత కృష్ణ ప్రసాద్**



చింతల కోటేశ్వరరావుకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సామినేని కృష్ణప్రసాద్

జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్ర ఉజ్వల భవిష్యత్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని, ఆ భరోసా తోనే పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు ఆ పార్టీని వీడి వైఎస్సార్ సీపీలోకి చేరుతున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువనేత సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ అన్నారు. స్థానిక చెరువు బజారుకు చెందిన చింతల కోటేశ్వరరావు తెలుగుదేశం పార్టీని వీడి మంగళవారం వైఎస్సార్ సీపీలోకి చేరారు. ఈ సందర్భంగా వెంకటకృష్ణ ప్రసాద్ ఆయనకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఉదయభాను నియోజకవర్గ అభివృద్ధి కోసం పడుతున్న తపన, కృషి తమను ఎంతో ఆకర్షితులను చేసిందని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో దేశంలోనే అనేక రాష్ట్రాలు ఏపీ వైపు చూస్తున్నాయని, ఆయన పాలన ఎంత లేదన్నా, మరొక 20 ఏళ్లు కొనసాగుతుందన్నారు. ఆయన మీద ఏర్పడిన నమ్మకంతోనే తాను వైఎస్సార్ సీపీలోకి చేరినట్లు తెలిపారు. నాయకులు తన్నీరు నాగేంద్ర, స్టీల్ ప్లాంట్ సుబ్బారావు, తాళ్లూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## వత్సవాయిలో రహదార్లకు మరమ్మతులు ప్రారంభం



మరమ్మతు పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ సీతమ్మ

వత్సవాయి: మండల కేంద్రం వత్సవాయిలోని రోడ్లకు మరమ్మతు పనులను మంగళవారం ప్రారంభించారు. వత్సవాయి పోలీస్‌స్టేషన్ దగ్గర నుంచి వేములనర్వ రహదారిలో ఎన్ఎస్‌పీ కాలువ వరకు, వైరా రహదారి నుంచి తండా వరకు ఉన్న ఆర్అండ్‌బీ రహదారిలో గోతులు ఏర్పడి ఇబ్బందికరంగా ఉంది. ఫిబ్రవరిలో పెనుగంచిప్రోలు శ్రీ లక్ష్మీతిరుపతమ్మ అమ్మవారి కల్యాణం నిమిత్తం పెద్ద సంఖ్యలో తెలంగాణ నుంచి భక్తులు రాకపోకలు సాగిస్తారు. ఈ నేపథ్యంలో వెంటనే ఈ రహదారికి మరమ్మతులు నిర్వహించాలని సర్పంచ్ భూక్యా సీతమ్మ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభానుకు విన్నవించారు. దీనిపై స్పందించిన ఆయన ఆర్అండ్‌బీ జిల్లా అధికారులతో మాట్లాడి మరమ్మతులకు నిధులు మంజూరు చేయించారు. ఈ మేరకు సర్పంచ్ సీతమ్మ మంగళవారం పనులు ప్రారంభించారు. రహదార్లకు మరమ్మతులు ప్రారంభించడంపై గ్రామస్తులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వత్సవాయి పంచాయతీ ఈవో షేక్ ఇమామ్ సాహెబ్, భూక్యా రాజానాయక్ తదితరులు పాల్గొన్నారు.

## స్త్రీనిధి నిధుల నుంచి గేదెలు పంపిణీ

**డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు**



డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు

పెనుగంచిప్రోలు: స్త్రీ నిధి నిధుల నుంచి డ్వాక్రా మహిళలకు గేదెలు అందించనున్నామని డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఆయన మండల కేంద్రం పెనుగంచిప్రోలులో మంగళవారం సాక్షితో మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లాలో 4 వేల మంది మహిళలకు గేదెలను ఇప్పించే కార్యక్రమం చేపట్టామన్నారు. ఒక్కో గేదెకు స్త్రీ నిధి ద్వారా లక్ష వరకు నిధులు అందిస్తామన్నారు. గేదె ఇచ్చే పాలను బట్టి ధర ఉంటుందని, కంకిపాడులో గేదెలు అందుబాటులో ఉంటాయన్నారు. ఉన్నతి నిధుల నుంచి యూనిట్ ధర రూ.50 వేలతో రైతులకు 10 కిలోల పొట్టేళ్లు అందిస్తామన్నారు. యూనిట్ ధర రూ.4,200తో 8 పెట్టలు, 3 పుంజులు కిలో బరువు ఉన్న వాటిని లబ్ధిదారులకు అందిస్తామని, ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసరా కింద జిల్లాకు రూ.600 కోట్ల వరకు నిధులు వస్తాయని, వాటితో 15 వేల యూనిట్లు ఏర్పాటు చేయించాలని ఆలోచన చేస్తున్నామన్నారు. ఆసరా కింద లబ్ధిదారులు పిండిమరలు, ఇతర వ్యాపారాలు చేసి జీవనోపాధిని మెరుగు పరుచుకోవాలన్నారు.

### 31 న కౌన్సిల్ ప్రత్యేక సమావేశం

జగ్గయ్యపేట అర్బన్: పేట మున్సిపల్ కౌన్సిల్ ప్రత్యేక సమావేశం ఈనెల 31 వ తేదీన నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర మంగళవారం తెలిపారు. కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో ఉదయం 11 గంటలకు జరిగే ప్రత్యేక సమావేశంలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను బడ్జెట్ అంచనాలు, 2022–23 ఆర్థిక సంవత్సరానికి సవరించిన బడ్జెట్ అంచనాలు ఆమోదం నిమిత్తం అజెండా సిద్ధం చేసినట్లు తెలిపారు.